
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట



నవతెలంగాణ 1

సోమవారం 21 ఆగస్టు 2023



దళితబంధు అవకతవకలు సరిచేస్తాం

నవతెలంగాణ జగదేవపూర్: దళితబంధులో జరిగిన అవకతవకలను సరి చేస్తామని రాష్ట్ర ఫారెస్టు కార్పొరేషన్ ఛైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. జగదేవపూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన దళితులు ఆదివారం ప్రతాప్‌రెడ్డిని కలిశారు. తాము అందరం బీఆరెస్ పార్టీ కోసం కష్ట పడ్డామని తెలిపారు. తమ గ్రామంలో తమకు తెలియకుండానే దళిత బంధు లబ్ధిదారులను ఎన్నిక చేయడం జరిగిందని గుర్తు చేశారు. నిజమైన లబ్ధిదారులకు దళిత బంధు అందలేదని అన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్తను కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉందని మీరు అందరూ కూడా వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని తెలిపారు. సాధ్యమైనంత వరకు మీ అందరికీ న్యాయం చేస్తానని ప్రతి ఒక్కరు సంయమనం పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, రాములు, కృష్ణ, మల్లేశం,బాలనర్సయ్య, సాయిలు, బాబు ,చింటూ, ప్రశాంత్, రాములు ,యాదగిరి, మల్లయ్య చంద్రయ్య, భాను ప్రసాద్, సురేందర్, మహిళలు యువకులు తదితరులున్నారు

బీఆర్ఎస్‌కు మైనంపల్లి దూరం

- మెదక్ టికెట్ ఇవ్వకుంటే కాంగ్రెస్‌లో చేరే చాన్స్
- హనుమంతరావుకు మల్కాజిగిరి.. రోహిత్‌కు మెదక్
- రెండు టికెట్లు ఇవ్వాలని మైనంపల్లి డిమాండ్
- పద్మాదేవేందర్‌కివ్వాలని కోరిన హరీశ్‌రావు
- తండ్రికి ఒకే.. కొడుక్కు నో చెప్పిన కేసీఆర్
- రోహిత్‌కు మెదక్ టికెట్ ఇచ్చేందుకు రేవంత్ భరోసా
- మైనంపల్లి కుటుంబం సీఎం సభకు హాజరయ్యేది అనుమానమే
- పద్మక్క మాకొద్దు.. రోహిత్‌కు టికెటివ్వాలి' అనుచరుల నిరసన





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మాల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్‌కు దూరం కానున్నారా..? తాజా రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. మైనంపల్లి హనుంతరావు తన కొడుకు రోహిత్‌కు రాజకీయ భవిష్యత్‌ను వెతుక్కునే పనిలో పడ్డారు. తన తర్వాత కాకుండా తనతో పాటే అసెంబ్లీలో అధ్యక్షా అనాలనే కోరిక బలంగా ఉంది. తనకు మల్కాజిగిరి ఎమ్మెల్యే టికెట్‌తో పాటు కొడుకుకు మెదక్ ఎమ్మెల్యే టికెట్ కావాలని పట్టుపడుతున్నారు. మరో పక్క బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం అందుకు ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. తొలి జాబితాలో మల్కాజిగిరి అభ్యర్థిగా హనుమంతారావు పేరు చేర్చిన కేసీఆర్ మెదక్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికే ఇవ్వాల్సి వస్తుందని తేల్చి చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. తన భవిష్యత్ కంటే తన కొడుకు ఉజ్వల భవిష్యతే ముఖ్యమని భావిస్తున్న హనుమంతరావు రోహిత్‌కు టికెట్ ఇవ్వడం కుదరకపోతే మరో దారి చూసుకుంటామని అల్టిమేటం జారీ చేసినట్టు చెబుతున్నారు. మెదక్‌లో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ముందస్తుగనే మైనంపల్లి అనుచరులు రోడ్డెక్కి పద్మక్కకు టికెట్ ఇవ్వొద్దంటూ నిరసన వ్యక్తం చేశారు.

మైనంపల్లి హనుమంతారావు సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటూ వస్తున్నారు. మెదక్ నియోజకవర్గాలనికి చెందిన ఆయన సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. క్రమంగా టీడీపీలో చేరి పనిచేశారు. మెదక్ నుంచి 2009లో ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర విభజన తర్వాత ఆయన మల్కాజిగిరికి సిఫ్ట్ అయ్యారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా 2018లో పోటీ చేసి గెలిచారు. మెదక్ రాజకీయాలకు దూరమైన హనుమంతారావు తిరిగిన తన సొంత గడ్డపై కాలు మోపారు. తాను కాకుండా తన వారసుడైన మైనంపల్లి రోహిత్‌ను రాజకీయాల్లోకి తీసుకోచ్చారు. బీఆర్ఎస్ తరపున మెదక్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రలజకు సేవ చేస్తూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఊరూరా ఆయన బోరు బండ్లు తిరుగుతూ ఉచితంగా బోర్లు డ్రిల్ చేశారు. ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధి చేశారు. ఏడాది గడవకముందే నియోకవర్గంలో తన తండ్రి హనుమంతారావుకు ఉన్న పరిచయాలను సుస్థిరం చేసుకుంటూ తనకంటూ పట్టు పెంచుకున్నారు. స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రత్యేకంగా గ్రూపుగా ఏర్పడి ఊరూరా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. మైనంపల్లి పౌండేషన్ పేరిట సేవా కార్యక్రమాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకుడుగా ప్రజల్లో పేరుతెచ్చుకున్నారు. నియోజకవర్గమంతగా మైనంపల్లి సేన పేరిట యువత పనిచేస్తుంది. సొంత గడ్డపై రాజకీయంగా పట్టు బిగించాలనే వ్యూహంతోనే మైనంపల్లి తండ్రికొడుకులు మెదక్ నియోజకవర్గంలో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారనే చర్చ నడుస్తోంది.

తండ్రికి టికెట్ కన్ఫం...కొడుకుకు నో

బీఆర్ఎస్ నుంచి మైనంపల్లి తండ్రికొడుకులిద్దరూ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. హనుమంతారావు మల్కాజిగిరి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనకు మళ్లీ అదే స్థానం నుంచి టికెట్ కేటాయిస్తూ తొలి జాబితాలో హనుమంతారావు పేరును చేర్చినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ప్రకటించబోయే తొలి జాబితాలో హనుమంతారావు పేరు కూడా ఉన్నది. అయితే ఆయన తన కోసం కాకుండా తన కొడుకు రోహిత్ భవిష్యత్ గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. బీఆర్ఎస్ అధినే కేసీఆర్ వద్దకెళ్లి తన కొడుకుకు మెదక్ నుంచి టికెట్ ఇవ్వాలని కోరినట్లు చెబుతున్నారు. ఈ విషయంలో 'మీకు టికెట్ కన్ఫం అయ్యింది. రోహిత్ గురించి పట్టుపట్టవద్దు. పద్మాదేవేందర్‌రెడ్డికి మెదక్ టికెట్ ఇవ్వాల్సి ఉంది. హరీశ్‌రావు చెప్పిన రెండు సీట్లలో ఆమె ఒకరు. అందుకని కాదనే పరిస్థితి లేదు. అర్థం చేసుకోవాలి' అంటూ సీఎం కేసీఆర్ చాలా స్పష్టంగా హనుమంతారావుకు చెప్పినట్లు విశ్వసనీ సమాచారం. ఆ చర్చ సందర్భంగా హరీశ్‌రావు గురించి హనుమంతారావు మాట్లాడుతూ' మెదక్ జిల్లాలో హరీశ్‌రావుకేం పని. సిద్దిపేట చూసుకుంటే సరిపోత ది. మా దారి మేం చూసుకుంటం' అని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.

రోహిత్‌కు కాంగ్రెస్ నుంచి మెదక్ టికెట్..?

బీఆర్ఎస్ నుంచి టికెట్ రాకపోతే కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ తెచ్చుకునేందుకు మైనంపల్లి తండ్రికొడుకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాంగ్రెస్‌లోకి వస్తే తండ్రికొడుకులిద్దరికీ టికెట్‌లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు మైనంపల్లి అనుచరులు పేర్కొంటున్నారు. మెదక్ నుంచి గత మూడు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటమి పాలైంది. అయితే ఓడిన ప్రతి సారి కూడా రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్‌కు మెదక్‌లో ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ బలమైన నాయకుడులేని లోపముంది. అందుకే ఆర్థిక, అంగబలమున్న మైనంపల్లి కుటుంబాన్ని పార్టీలో చేర్చుకుంటే మెదక్‌లో గెలిచే అవకాశాలుంటాయని కాంగ్రెస్ నేతలు సమాలోచనలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మల్కాజిగిరి నుంచి హనుమంతారావు, మెదక్ నుంచి రోహిత్‌కు టికెట్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరించినట్లు చర్చ నడుస్తోంది.

మెదక్‌లో పద్మక్క వద్దంటూ నిరసనలు

మెదక్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఇవ్వొందంటూ బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మెదక్ సెంటర్‌లో నిరసన తెలుపుతూ పద్మక్క మాకొద్దు... రోహిత్‌కు టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ మెదక్‌లో ఈ నెల 23న పర్యటించనున్నారు. భారీ ఎన్నికల సభ నిర్వహించనున్నారు. ఆ సందర్భంగా కూడా మైనంపల్లి అనుచరులంతా ప్లేకార్డు ప్రదర్శించి రోహిత్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేయాలని చూస్తున్నట్లు చెబుతున్నారు. సీఎం సభకు కూడా మైనంపల్లి అనుచరులు, అభిమానులు హాజరుకావద్దని సంకేతం ఇచ్చినట్లు తెలుస్తోంది. సీఎం మెదక్ సభలో పద్మాదేవేందర్‌రెడ్డి పేరు ప్రకటిస్తే మరోసటి ఒకటి రెండు రోజుల్లోనే మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్‌లో చేరతారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కోహెడ

మానవాళి మనుగడకు విద్య, వైద్యం ప్రాముఖ్యమైనదని గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గవ్వ వంశీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కెల్విన్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు గవ్వ కిషన్‌రెడ్డి, హాస్పిటల్ ఛైర్మన్ చింతం సురేష్‌కుమార్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో రక్తపరీక్ష, గుండె పరీక్ష, ఈసీజీ, టుడికో, బీపీ షుగర్ లాంటి పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పేద ప్రజలకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో తోడ్పాడుతాయని పలువురు గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ చౌరస్తా వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని పీవీ నరసింహారావు సేవాసంస్థ అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో క్లియర్ విజన్ కంటి హాస్పిటల్, ప్రేరణ చారిటబుల్ ట్రస్ట్, పీవీ నరసింహారావు ఎడ్యుకేషన్ రీసెర్చ్ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సామాజిక కార్యకర్త వలుస సుభాష్, డాక్టర్‌లు గౌతమ్ తిరుకోవెల, వేణు, సప్తఋషి, ప్రశాంత్ నాయక్, హాస్పిటల్ సిబ్బంది, కోనవేణి బాలకిషన్, నిషాని సంపత్, పూసల రాజశేఖర్, ములుగురి హరికృష్ణ, గడపే సుజిత్, శ్రావణ్, దర్గారెడ్డి, గవ్వ రాజిరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, అవినాష్, అరవింద్, జంపయ్య, సిద్దు, గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ద్వజస్తంభ పునః ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ హాజరు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో భక్త మార్కండేయ ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆదివారం హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఆలయాలు అభివృద్ధి చెందాయన్నారు. నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం పద్మశాలీ కులస్థుల ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్, జెడ్పీటీసీ నాగరాజు శ్యామల మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్, ఎంపీటీసీ శేఖర్, పద్మశాలీ సంఘం కులస్థులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేజీవీల్స్‌తో రోడ్లను దున్నేయకండి



నవతెలంగాణ-తొగుట

కేజీవీల్స్‌తో పంట పొలాలు దున్నడం బాగుంటుంది. అదే కేజీవీల్స్‌తో తిరగం వల్ల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లపై కయ్యలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా రోడ్లు బాగలేక గుంతలు, గతుకుల రోడ్లను ప్రభుత్వం బాగుచేయడం లేదని వివిధ పార్టీ ల నాయకులు, ప్రజలు ఆరోపించారు. దానికితోడు మండలంలో మల్లన్న సాగర్ ప్రాజెక్టును నిర్మాణం చేయడంతో మరింత భారీగా రోడ్లు చెడిపోయిన పరిస్థితులు చూశాం. ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో ఈ మధ్య కాలంలో రోడ్లను బాగు చేశారు. 90 శాతం బీటీ వేయడం పూర్తి కావచ్చింది. అన్ని రోడ్లు పూర్తి రెన్యూవల్ చేసి బీటీ వేయడం పూర్తి అయ్యాక కేజీవీల్స్‌తో రోడ్లను దున్నేయడం సరికాదని వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లు గమనించి కేజీవీల్స్‌తో (దమ్ము చక్రాలు) రోడ్లపై రావద్దని కోరుతున్నారు. రోడ్లును చెడిపోకుండా ఉండేందుకు ఓ ట్రాక్టర్ ఓనర్ రూ.4 వేల వ్యయంతో ఈ ట్రాక్టర్ కేజీవీల్‌కు పట్టీలు అమర్చాడు. చాలా మంది ట్రాక్టర్ నడిపే వారు ట్రాక్టర్ డబ్బులు ఖర్చు చేస్తుంటారు. అందులో భాగంగా మిగతా వారు ఇలా కేజీవీల్స్‌కు పట్టీలు అమార్చుకొని రోడ్లను కాపాడేందుకు అందరం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కారు అదుపుతప్పి బోల్తా ఒకరి మృతి



నవతెలంగాణ కొండపాక

కుకునూరుపల్లి వద్ద రాజీవ్ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం అంబసాహెబ్ పేట గ్రామానికి చెందిన గంగపట్నం వంశీ(25) హైదరాబాదులోని అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సెలవు రోజుల్లో తన కారు కిరాయికి వెళ్తాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మంచిర్యాలకు కిరాయికి వెళ్ళాడు. ఆదివారం ఉదయం తిరిగి హైదరాబాదుకు వెళుతున్న క్రమంలో అతివేగంగా అజాగ్రత్తగా వెళుతున్న కారు కుకునూరుపల్లి వద్ద రాజీవ్ రాదారిపై డివైడర్ పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొంది. డివైడర్‌కు అవతలి వైపు రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో కారు నడుపుతున్న వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు రోడ్డుపై పడడంతో ఉదయం కొద్దిసేపు వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మృతదేహాన్ని సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వంశీ భార్య వెంకట సత్యవతి ఫిర్యాదు మేరకు కుకునూరు పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఎస్సీ వర్గీకరణ విశ్వరూప మహాసభను దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షులు సల్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామం దళిత కాలనీలో దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎంఈఎఫ్ అధ్యక్షులు సల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో జరిగే ఎస్సి వర్గీకరణ కోసం మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దండోరా సాధించిన విజయాలను ప్రతి పల్లెకు ప్రతి గడపగడపకు తీసికెళ్లాలన్నారు. అందరిని సమాయత్తం చేసి హైదరాబాద్ లో జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేసే బాధ్యతను అందరూ తీసుకొని మాదిగల సత్తాను సాటాలని తెలియజేశారు. ఈసమావేశంలో ప్రజ్ఞాపూర్ దండోరా నాయకులు చెక్ పోస్ట్ నర్సయ్య , ఈది దుర్గయ్య , రాజి లక్ష్మి నర్సయ్య , డాకని భిక్షపతి , గుండ్ర రామచంద్రము , డాకని చంద్రం , గుండ్ర బాబు , నర్సీ యాదగిరి , సైదమ్మోళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాంజనేయ సిమెంట్ షాప్ ప్రారంభం



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో మర్కుక్ గ్రామానికి చెందిన పుట్ట రవి ముదిరాజ్ శ్రీరామాంజనేయ సిమెంట్ షాపును మర్కుక్ బీఆర్ఎస్ బీసి సెల్ అధ్యక్షులు, సిద్దిపేట జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అజయ్ రెడ్డి, సీనియర్ నాయకులు, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశ్ యాదవ్,లింగం, కార్తిక్ పంతులు తదితరులున్నారు.

ఏఐఎస్ఎఫ్ సమావేశం జయప్రదం చేయలి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఈనెల 25న చేపట్టే హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్ లో జనరల్ బాడీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విద్యారంగాన్ని విస్మరిస్తూ, విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రవేటు యూనివర్సిటీలను ఈ దేశంలోకి తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. జాతీయ నూతన విద్యా విధానం 2020ను తీసుకొచ్చి విద్యను కాషాయకరణ, కార్పొరేటీరణ, ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. గత తొమ్మిది సంవత్సరాలుగా విద్యారంగానికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యను పేద, బడుగు,బలహీన వర్గాలకు విద్యార్థులకు అందకుండా కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అన్ని మండలాల విద్యార్థులు సమావేశానికి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట, హనుమకొండ జిల్లా అధ్యక్షులు సంగెం మధు, వేల్పుల ప్రసన్నకుమార్ ,నాయకులు రాముగల్ల నరేష్ కేశబోయిన రాము, శ్రీనివాస్, రమేష్, అరుణ్, ప్రవీణ్, శ్రీకాంత్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించి గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలి



నవ తెలంగాణ కొండపాక

ఇంటి స్థలం లేనివారికి ఇంటి స్థలం కేటాయించి ఇల్లు కట్టుకోవడానికి గృహలక్ష్మి పథకం కింద రూ.ఐదు లక్షలు ఇచ్చి అర్హులైన వారిని ఆదుకోవాలని సీపీఎం కొండపాక మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సిపిఎం కొండపాక మండల కమిటీ సమావేశం విశ్వనాథ్ పల్లి రవీంద్ర నగర్ ప్రజా సంఘాల ఆఫీసు వద్ద నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం కొండపాక మండల సభ్యులను ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకాన్ని మూడు లక్షలు కాకుండా అర్హులైన వారందరికీ ఐదు లక్షలు కేటాయించాలని ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించినటువంటి దళిత బంధు బీసీ బంధు కూడా చాట్ల తౌడు పోసి కుక్కల కొట్లాట పెట్టే విధంగా ఉందని అన్నారు. అర్హులైన పేదలను గుర్తించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు ఒకపక్క కబ్జాలకు గురవుతుంటే పేదలకు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ బందు దళిత బంధు అర్హులకు ఇవ్వకుండా చూస్తే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ మధ్యకాలంలో కూర్చున్న వర్షాలకు అనేక ఇండ్లు కూలిపోయాయని కోల్పోయిన లబ్ధిదారులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ చెరువులు పూర్తిగా నిండి వెనకదారి నుండి నీరు పోతున్న పట్టించుకునే వారు లేరని ఆపోయారు.వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.ఈ సమావేశానికి తాటోజు రవీంద్ర చారి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొమురవెల్లి కనకయ్య మూడోజు కనకాచారి ప్రభాకర్ శ్రీనివాస్ కొమురయ్య నరహరి నరహరి మల్లేశం సభ్యులు ఆంజనేయులు నర్సింలు మల్లయ్య యాదగిరి లచ్చవ్వ మణెమ్మ రామవ్వ పాల్గొన్నారు

మామిడి మోహన్‌రెడ్డి సుడిగాలి పర్యటన



నవ తెలంగాణ -దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండలంలోని గొడుగుపల్లి, ఇందుప్రియల్ గ్రామాలలో ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి మనోధైర్యాన్ని నింపారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని కోల్పో వద్దని భరోసా కల్పించామన్నారు. ప్రతి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఏ ఆపద వచ్చిన నన్ను సంప్రదించాలన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటనని హామీ ఇచ్చారు. ఒకే కుటుంబంలో తల్లి తండ్రి నానమ్మ చనిపోయి నిర్వాసితులైన యాదగిరి ముగ్గురు ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారిని ప్రజాహిత ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామన్నారు. ఒక ఇంట్లో అందరూ కష్టం చేసుకుంటేనే పూట గడవని ఈ రోజుల్లో కుటుంబ సభ్యులను ఈ చిన్నారులు పోగొట్టుకోవడం బాధాకరమన్నారు. మానవత్వవాదులు ముందుకు వచ్చి ఈ చిన్నారులను ఆర్థికపరంగా ఆదుకోవాలని ఆయన తెలిపారు. ఈ పిల్లలను నేనే దత్తత తీసుకొని వారి యోగక్షేమాలకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇందుప్రియల్ సర్పంచ్ సూరంపల్లి శ్యామల కుమార్, రాయపోల్ మాజీ సర్పంచ్ కమ్మరి శ్రీనివాస్, నల్ల ఆంజనేయులు, గువ్వలెగి ఎల్లం, సందీప్ దౌల్తాబాద్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూ, ఎంపీటీసీ మల్లేశం గొడుగుపల్లి గ్రామ బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మల్లానిరాజు తదితరులు పాల్గొన్నారు

భారత రాష్ట్ర సమితిలో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో జగదేవ్పూర్, వర్గల్ మండలాల నుండి భారత రాష్ట్ర సమితి పార్టీలోకి భారీగా కాంగ్రెస్, బీజేపీ నుండి చేరినట్లు తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆదివారం జగదేవ్పూర్ మండలంలో పలు గ్రామాల నుండి కాంగ్రెస్ బిజెపి నాయకులు చేరారు. అదేవిధంగావర్గల్ మండలంలోని మీనాజీపేట గ్రామానికి చెందిన బిజెపి కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా వేసి టిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానింపచారు. తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. రైతుబంధు రైతు బీమా దళిత బందు బీసీ బందు మైనారిటీ బందు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కెసిఆర్ కిట్టు 24 గంటలు ఉచిత కరెంటు ఆసరా పింఛన్లు వృద్ధాప్య వికలాంగ పింఛన్లు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి శూన్యం అన్నారు. గత ప్రభుత్వాలు వారి రాజకీయ లబ్ది కోసమే పాటు పడ్డారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సబండ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక రకాలుగా కృషి చేస్తున్నారన్నారు. ప్రతి వర్గం ముఖ్యమంత్రి పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు కుమ్మరి మధు కుమ్మరి లక్ష్మయ్య కుమ్మరి శ్రీకాంత్ కుమ్మరి నవీన్ జాలిగామ గణేష్ చాకలి బిక్షపతి కందుకూరి నాగరాజు కొత్తూరు విగ్నేష్ రాముని సహదేవ్ దరిపల్లి అజయ్ భూశెట్టి నవీన్ తపాల నవీన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యం యాదవ్ ఏఎంసీ డైరెక్టర్ కుమార్ యాదవ్, పిఎసిఎస్ డైరెక్టర్ కీసర యాదగిరి, సీనియర్ నాయకులు నగేష్ సురేష్ ప్రభాకర్ లక్ష్మణ్ తదితరులున్నారు.

మా సార్‌కే టికెటివ్వాలి


- మదన్‌రెడ్డి అనుచరుల డిమాండ్
- లేదంటే తీవ్ర వ్యతిరేకత తప్పదు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే తిరిగి ఇవ్వాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. తొలి జాబితాలో మదన్‌రెడ్డి పేరు ఉండాలని ఆశపడుతున్నారు. అయితే నర్సాపూర్ టికెట్‌ను మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డికి ఇచ్చే అవకాశముంది. ఇదే విషయం తెలిసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అనుచరులు ఆదివారం సాయంత్రం నర్సాపూర్‌లో క్యాంపు కార్యాలయంలో గుమిగూడారు. పెద్దాయనకు టికెట్ రావట్లేదన్న సంకేతాలు రావడంతో తట్టుకోలేకపోతున్నారు. మదన్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వేళ టికెట్ రాకపోతే రోడ్లెక్కి ఆందోళనలు, నిరసనలు చేస్తామని టీఆర్ఎస్ నర్సాపూర్ మండల ముఖ్య నాయకులు అశోక్‌గౌడ్, హబీబ్‌ఖాన్, భోగ చంద్రశేఖర్, పంబలి బిక్షపతి, అంజనేయులు గౌడ్ తదితర నాయకులు పెద్ద ఎత్తున క్యాంపు కార్యాలయానికి చేరారు. టికెట్ ఎవరికి వస్తుందనే విషయాల గురించి చర్చించుకున్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ రాకపోతే తామంతా తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని ప్రకటించారు.

రోడ్డు పక్కన బావులకు రక్షణ గోడలేవీ?





నవతెలంగాణ - చిన్నకోడూరు

అసలే రెండు వరుసల రింగ్ రోడ్డు. రోడ్డు ఎక్కమా వాహనదారునికి తెలియకుండానే మెరుపు వేగంతో పరుగులు పెట్టేలా నునుపైన, విశాలమైన రోడ్డు. ఇంకేముంది వాహనదారులు ఇష్టారీతిన రయ్ రయ్ మంటూ దూసుకుపోతుంటారు. అక్కడే రోడ్డును ఆనుకుని పిచ్చి మొక్కలు, ఏపుగా పెరిగిన చెట్ల మధ్య అదుపు తప్పితే ప్రాణం బావిలో అనే పరిస్థితి నెలకొంది. సిద్దిపేటకు హారంలా రెండు వరుసల రింగ్ రోడ్డును మంత్రి హరీష్ రావు ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఈ రోడ్డు 88 కి.మీ మేర రూ.160 కోట్లతో రాజీవ్ రహదారి నుండి రాజీవ్ రహదారిని అనుసంధానం చేస్తూ సిద్దిపేట చుట్టూ వలయాకారంలో నిర్మిస్తున్నారు. సిద్దిపేట చుట్టూ రెండు వరుసల రింగ్ రోడ్డు నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. రింగ్ రోడ్డును ఆనుకుని కనిపించకుండా పిచ్చి మొక్కలు, ఏపుగా పెరిగిన చెట్ల మధ్య ఉన్న వ్యవసాయ బావులకు రక్షణ గోడలు నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు, రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. మొన్నటి వరకు కురిసిన వర్షాలకు రోడ్డు అనేక చోట్ల చీలికలు, కయ్యలు పడ్డాయి. ఏ చీకట్లో ఎదుటి వాహనం హెడ్ లైట్స్ కి భయపడి రోడ్డు దిగామా కయ్యల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా నడిపినా పెను ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి రోడ్డు ఆనుకుని ఉన్న ప్రమాదకరమైన బావులు వద్ద అడ్డుగోడలు, కయ్యలను పునరుద్ధరించాలని వాహణదారులు కోరుతున్నారు.

కేసీఆర్ కుటుంబ పార్టీకి కాలం చెల్లింది



నవతెలంగాణ-నంగునూరు: తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పార్టీకి కాలం చెల్లిందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి జ్యోష్యం చెప్పారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మరోసారి అధికారం కోసమే పావులు కదుపుతూ గ్లోబల్ ప్రచారాలు చేస్తూ ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. ఖమ్మంలో కాంగ్రెస్ సభ చూసి కళ్లు తిరిగినా కేసీఆర్ ఇప్పటికి కోలుకోలేకనే కొడుకును, అల్లుణ్ణి కళ్లకు బలుపాలు కట్టి తిప్పుతున్నాడని ఆరోపించారు.

హైడ్రాలిక్ మరమ్మతు చేస్తుండగా డ్రైవర్ మృతి



నవతెలంగాణ-నార్సింగి

ట్రాక్టర్ ట్రాలీ మరమ్మత్తు చేస్తుండగా హైడ్రాలిక్ విఫలమై డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంపె రాజు (30) శెట్టిపల్లి, సంగారెడ్డి జిల్లా నివాసి గత రెండు సంవత్సరాలు గా తన భార్య కంపె మంగమ్మ తో కలిసి వల్లూరు లోని మాచమ్మగారి నర్సింలు కు చెందిన ఇటుక బట్టిలో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ట్రాక్టర్‌ను నిలిపి ట్రాలీని హైడ్రాలిక్ తో పైకి లేపి ఒక సిమెంట్ ఇటుక అడ్డు పెట్టి ట్రాలీ కింద నిలబడి హైడ్రాలిక్ పైప్ ను మరమ్మత్తు చేస్తుండగా, హైడ్రాలిక్ ఆయిల్ బయటకు చిమ్మి ఇటుక విరిగి పోయిందని దానివల్ల ట్రాలీ కింద నిలబడి పని చేస్తున్న రాజు పై ట్రాలీ పడి అతను ట్రాలీ కి చేషి కి మధ్యలో ఇరుక్కున్నాడు. అది గమనించిన రాజు భార్య కేకలు పెట్టి అక్కడ పనిచేస్తున్న వార్ సహాయంతో బయటకు తీయడానికి ప్రయత్నం చేశారు. బయటకు తీయడం సాధ్య పడనందున జెసిబి తెప్పించి రాజు ను బయటకు తీసి హుటాహుటిన నార్సింగి పట్టణంలోని నార్సింగి నర్సింగ్ హెూం కు చికిత్స కోసం తరలించారు.అప్పటికే మృతి చెందాడని డాక్టర్ చెప్పారు.

పటాన్‌చెరులో చెడ్డి గ్యాంగ్ రెక్కీ?

నవ తెలంగాణ- పటాన్ చెరు: పటాన్‌చెరు పట్టణంలోని ఓ అపార్ట్మెంట్లో పట్టపగలే దొంగతనం కోసం రెక్కీ నిర్వహిస్తున్న నలుగురి ముఠాలోని ఓ యువకున్ని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. అపార్ట్మెంట్ వాసుల వివరాల మేరకు పటాన్ చెరు పట్టణం లోని జె పీ కాలనీ లో గల గీతాసదన్ అపార్ట్మెంట్ లో ఆదివారం సాయంత్రం నలుగురు చోరి కోసం రెక్కీ నిర్వహించడానికి అపార్ట్మెంట్ లోకి నలుగురు చొరబడ్డారు. అపార్ట్మెంట్ వాసులు గమనించడంతో ముగ్గురు పరారవ్వగా ఓ యువకుడు బాత్ రూమ్ లోకి వెళ్లి దాక్కున్నాడు. దాక్కున్న యువకుడ్ని తాళ్లతో బంధించి చితకబాది పోలీసులకు అప్పగించారు. గత రెండు రోజుల క్రితం రాత్రి సైతం అపార్ట్మెంట్ ముందున్న చెట్టు కింద మద్యం సేవించినట్లు బంధించిన దొంగ చెప్పాడు. రెక్కీకి వచ్చిన నలుగురు బీహార్ కి చెందిన వారగా, చెడ్డి గ్యాంగ్ గా అపార్ట్మెంట్ వాసులు అనుమానిస్తున్నారు. పరారైన మిగతా వారిని పట్టుకోవాలని అపార్ట్మెంట్ వాసులు పోలీసులను కోరుతున్నారు.

చింతా ప్రభాకర్‌ను కలిసిన మైనార్టీ నేతలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణ 20, 21 వార్డుకు చెందిన మైనార్టీ నేతలు స్టేట్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మెన్ చింతా ప్రభాకర్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజ కవర్గంలో చింతా ప్రభాకర్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలకు చేపడుతున్న దన్నారు. ఆ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులం అయ్యామని.. త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసూద్, యూనిస్ ,నర్సంలు , ముజమిల్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరదే ను ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధ న్‌రెడ్డి అధ్వర్యంలో హైకోర్టులో కలిసి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయమూర్తులు జిల్లా న్యాయధి కార సంస్థకు కాస్ట్ రాయడంతో పాటు బార్ అసోసియే షన్లకు కూడా రాయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులుగా దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-జోగిపేట

ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శాశ్వత ఆహ్వానితులుగా అందోల్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న దామోదర రాజనర్సింహకు ఈ పదవి రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చశారు. గతంలో కూడా అనేక ఉన్నత పదవులను ఆయన నిర్వర్తించారు. నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజనర్సింహా నివాసానికి వెళ్లి శాలువా పూలమాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.



ముంబై ఎమ్మెల్యేను సన్మానించిన బీజేపీ మండల నేతలు

నవతెలంగాణ-జిన్నారం

బీజేపీ మండలాధ్యక్షులు బండి శ్రీకాంత్ గౌడ్ బృందం ఆదివారం 'విధాన్ సభ ప్రవాస్ యోజన' వర్క్ షాప్‌లో భాగంగా పటాన్చెరు నియోజకవర్గానికి పరిశీలకుడిగా విచ్చేసిన ముంబై వాంద్రే(పశ్చిమ) నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ముంబై అధ్యక్షులు, మాజీ మంత్రి, బీసీసీఐ కోశాధికారి ఆశిష్ షెల్లరను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిన్నారం మండల పార్టీ స్థితిగతులపై వారు చర్చించారు.



సైపుద్దీన్ గోరీని పరామర్శించిన నరోత్తం బృందం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మున్సిపల్ మాజీ మేనేజర్ సైపుద్దీన్ గోరీ అనారోగ్యంతో బాధప డుతూ.. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెల్సుకున్న బీఆర్ఎస్ నాయకులు వై.నరోత్తం ఆసుపత్రికి వెళ్లి సైపుద్దీన్ గోరీని ఆదివారం పరామ ర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ మసూద్ హైస్సేన్, బాసిత్, అత్తర్ గోరి తదితరులు పాల్గొన్నారు.



పట్లోల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కల్హేర్ మండలం బీబీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో దేవిరెడ్డి, నర్సారెడ్డి, వెంకట్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, సంతోష్ రెడ్డి, గుండు దేవేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, సాయిలు, విట్టల్ రెడ్డి ఉన్నారు. అనంతరం సంజీవరెడ్డికి బీబీపేట్ గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు వినోద్ పటేల్, ఎస్టీ సెల్ కిషన్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్, కృష్ణ, అర్జున్ మాజీ ఎంపీటీసీ ఏసన్న తదితరులు ఉన్నారు.



ఏఎన్ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ఏఎన్ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించాలినీ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యా లయం వద్ద గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నిరోధిక సమ్మెలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. ప్రజా ఆరోగ్య విభాగానికి చెందిన సం చాలకుడు జి. శ్రీని వాసరావు ఏఎన్ఎంలతో చర్చలు జరిపి సమ్మె విరమింప చేయాలన్నారు. ఏఎన్ఎ ంల పట్ల మొండి వైఖరి సరికాదన్నారు. ఏఎన్ఎంల సమ స్యలు పరిష్కా రం అయ్యే వరకు సమ్మె ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీలత, వినయ్, కుమారి, శివలక్ష్మి, మంజుల, మనమ్మ, అంజమ్మ ప్రేమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

29న సదరం క్యాంపు



నవతెలంగాణ-మునిపల్లి

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 29 తేదీన నిర్వహించే సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశిబిరానికి సంబంధించి స్పాట్స్ ఈనెల 22 (మంగళవారం) నాడు కేటాయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. అర్హులైన వికలాంగులు మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఫోటోగ్రఫీ దినోత్సవం



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో ఫోటోగ్రఫీ దినోత్స వాన్ని ఫోటో గ్రాఫర్స్ బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా జిన్నారం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ విజయరావు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభిం చారు. ఫోటోగ్రఫీ అనేది ఒక గొప్ప ఆర్ట్ అని ఈ సందర్భంగా ఎస్సై అన్నారు. ఈ కార్యక్ర మంలో జిన్నారం మండల ఫోటోగ్రాఫర్ల బృందం పాల్గొన్నారు

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం









నవతెలంగాణ-జిన్నారం

మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగు రమేష్, జిన్నారం మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే కృష్ణలు అన్నారు. మండల కేంద్రంలోని జిన్నారం కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళ్ల ర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చరిత్రలో నిలి చిపోయేలా రాజీవ్ గాంధీ అభివృద్ధి పనులు చేశారన్నారు. అలాగే ఇంటర్నెట్‌తో పాటుగా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ దేశాన్ని ముందుకు నడిపించిన ఘనత ఆయనకే దక్కి ందన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీని ఆశయాలను ఆద ర్శంగా తీసుకొని అభివృద్ధి పథంలో ముందడుగు వేయాల న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జయప్ర కాష్, సత్య నారాయణ, రాజుగౌడ్, లక్ష్మణ్, రాజ గోపాల్ రె డ్డి, నాగరాజు, నల్తూరు ఉపసర్పంచ్ రమేష్, పర్వతాలు, దు ర్గేష్,గోపాల్‌రెడ్డి, సయ్యద్ రాహుఫ్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలను జోగిపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ..రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివ న్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో 13 వ వార్డు కౌన్సిలర్ రంగా సురేష్, మాజీ కౌన్సిలర్లు ప్రదీప్ గౌడ్, శరత్ బాబు, కాంగ్రెస్ నాయకులు ఉల్వాల రాజు, సతీష్, మధు, కృష్ణ, శ్రీధర్, అనిల్, శ్రీనివాస్, రాజు, జగ్గు తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : మండలంలోని మేడ్యుంద గ్రామంలో మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు ఘనంగా నిర్వహి ంచారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పి ంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్య క్షులు పగిలి వీరప్ప, బూత్ అధ్యక్షులు సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తమన గారి బక్కప్ప, ప్రభు, అంజయ్య యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ యువజన ఉపాధ్యక్షులు పోచయ్య యాదవ్, నాయకులు అనిల్, శ్రీశైలం, శేఖర్, పీరయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల : మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్ గాంధీ 79వ జయంతిని పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో జిన్నారం కాంగ్రెస్ పార్టీ మండల ఎంపీపీ డి రవీందర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, వడ్డే కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్, పెంటా రెడ్డి, మద్ది ప్రతాప్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, కావలి శంకర్, సాయి చందర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ కళ్యాణ మండపం ప్రారంభం

- ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని వీరన్నగూడెం గ్రామ పరిధిలో గల భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం వద్ద నూత నంగా నిర్మించిన వీరశైవ లింగాయత్ కళ్యాణ మండపాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మండల ప్రజా ప్రతిని ధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయా న్ని అన్ని వసతులతో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. పెరు గుతున్న భక్తులకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నా మన్నారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీ ణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి కుమార్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఆలేటి శ్రీని వాస్ రెడ్డి, గటాటి భద్రప్ప, నరేందర్‌రెడ్డి, వేణు, ప్రవీణ్‌రెడ్డి, రమేష్ అప్ప, చక్రపాణి, మడపతి గణేష్, ఆలయ కార్య నిర్వహణ అధికారి శశిధర్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంశీధర్‌రావును కలిసిన బీరయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా నియమితులైన కల్వకుంట్ల వంశీధర్‌రావును ఆయన నివాసంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు బీరయ్య యాదవ్ ఆదివారం మర్యాదపూర్వ కంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వాన ఇన్‌చార్జ్ వంశీధర్ సమన్వయంతో మహారాష్ట్రలో బీఆర్ఎస్ శరవేగంగా విస్తరిస్తున్నదన్నారు. మహారాష్ట్ర రాజకీయ చిత్రంలో బీ ఆర్ఎస్ ప్రధాన పాత్రను పోషిస్తుందన్నారు. 2024అసెంబ్లీ ఎన్నికల్లో బీ ఆర్ఎస్ లేని ప్రభుత్వం మహా రాష్ట్రలో ఏర్పడదన్నారు. మహారాష్ట్రలో ముఖ్యంగా రైతులు, దళితులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారు కేసీఆర్ నాయకత్వానికి, తెలంగాణ మోడల్ పరిపాలనకు ఆకర్షి తులు అవుతున్నారన్నారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినా దం మహారాష్ట్ర రాజకీయాల్లో సునామీని సృష్టిస్తుందన్నారు.

ఈనెల 23న సీఎం సభను సక్సెస్ చేయాలి

- అందోల్ మున్సిపల్ సీఎం సభ ఇన్చార్జి మనోహర్ గౌడ్



నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 23న మెదక్‌లో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని సంగారెడ్డి జెడ్పీటీసీ, సీఎం సభ ఆందోల్ జోగిపేట మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్‌గౌడ్ అన్నారు. అందోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సి పల్ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధి నుంచి 2500 మందినీ తరలించాలని సూచించారు. నియోజకవర్గం నుంచి మొత్తం 25 వేల మందిని తరలి ంచేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సీఎం సభను సక్సెస్ చేయడంలో కార్యకర్తలు ముందుకు రావాల న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ నాయకులు చాపల వెంకటేశం, పడిగే సత్యం, గాజుల నవీన్, సత్యం, నాగరాజు, మహేష్ యాదవ్, పింటూ, సంతోష్, గోపాల్, అనిల్, వినోద్‌రెడ్డి, గోరే, షకీల్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో 11,12 వార్డులను కలుపుతూ సీసీరోడ్లు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట మున్సిపల్ పరిధిలోని 11,12 వార్డులను కలుపుతూ ఆదివారం సీసీరోడ్డు పనులు ప్రారంభమ య్యాయి. ఈ పనులను 12వ వార్డు కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు (నాని) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వార్డులో కలిపి ఉన్న పరిధిలో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామన్నారు. ఇరువార్డుల కాలనీ వాసులకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. అనేక ఏండ్లుగా సీసీరోడ్డు లేక కాలనీవాసులు ఇబ్బం దులు పడుతుండడంతో మున్సిపల్ నిధులనుంచి ఈ పన ులు చేపడుతున్నామన్నారు. 12వ వార్డులో అవసర మున్న చోట సీసీరోడ్డు పనులను రూ.50 లక్షలతో ఇటీవలే చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటివరకు మెజారిటీ పనులు పూర్తి చేశామన్నారు. అన్ని కాలనీలలో సీసీ పనులు, మురికి కాలు వలు పూర్తి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గూడెం నాగరాజు, 12 వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు ఉస నాగరాజు, ఉపాధ్యక్షులు బిర్లా శంకర్, 11వ వార్డు అధ్య క్షులు నాగరాజు, నాయకులు ఉసా మాణిక్యం,కే ఆర్, ప్రభు, నాగరాజు, శివశంకర్, అంజి, శివరాజ్, కాలేష్, కడాల మల్లే శం, శంకర్, కిట్టు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జగంపేట అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

- ఎమ్మెల్యేకు, జెడ్పీ వైస్ చైర్మన్‌కు, ఎంపీటీసీకి పంచాయతీ పాలకవర్గం కృతజ్ఞతలు



నవతెలంగాణ-జిన్నారం

సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధి చేయడానికి పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశం గౌడ్ ప్రత్యేక చొరవ తీసు కుంటున్నారని జంగంపేట గ్రామ సర్పంచ్, పాలకవర్గం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. రూ.45 లక్షలతో నూతనంగా నిర్మిం చిన జంగంపేట గ్రామపంచాయతీ భవనాన్ని రేపు(మంగళ వారం) ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకోనున్నట్టు వారు తెలిపారు. ఈ మేరకు ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ జోగు వెంకటయ్య ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి వార్డు సభ్యులు శంకరప్ప, నర్సారెడ్డి, మల్లారెడ్డి, దుర్గేష్ యాదవ్, నర్సింహులు ఈశ్వరయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటువేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

- జాతి రత్నాలు సినిమా డైరెక్టర్ కె.అనుదీప్



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని జాతి రత్నాలు సినిమా డైరెక్టర్ కె.అనుదీప్ సంగారెడ్డి జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఓటు మన ఆయుధం' అని.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడుని ఎన్నుకో వాలని పిలుపునిచ్చారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈనెల 26, 27 మరియు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉందని, ఓటరు జాబితాలో తమ పేర్లు సరిచూసుకోవాలని, అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆర్సీపురంలో సెప్టెంబర్ 3న బోనాల పండుగ



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్లోని శ్రీనివాస్ నగర్ కాలనీలో గల ఐదుగుళ్ల పోచమ్మ గుడి ఆలయంలో సెప్టెంబర్ 3న శ్రావణమాసం బోనాల పండుగను నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ పుష్ప తెలిపారు. ఆదివారం గ్రామ పెద్దలతో ఆలయ ప్రాంగణంలో కార్పొరేటర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అందరి సల హాలు సూచనలు మేరకు సెప్టెంబర్ 3న బోనాల పండు గను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఐదుగుళ్ల పోచమ్మ గుడి ప్రాంగ ణంలో శ్రావణమాస బోనాల పండుగను ఘనంగా నిర్వహించు కోవడం ఆనవా యితీగా వస్తున్నదన్నారు. ఈసారి కూడా బోనాల పండు గను అంగరంగ వైభవంగా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిహెచ్ఎంసి నుండి శానిటేషన్, లైటింగ్, పరిసరాల శుభ్రత, పెంటమాలజీ వంటివి చేయి స్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నిరంజన్ రెడ్డి, ఎల్లార్తి మల్లేష్, ఆలూరి గోవింద్, గోపాల కృష్ణ, గ్యానేశ్వర్ గౌడ్, మావీన్ గౌడ్, తొంట నర్సిం హ, బైకాన్ సాయిలు, ఊరెళ్ళ రాజు, మహేందర్ రెడ్డి, యాద య్య, నర్సింగ్,దప్పు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ జెడ్పీటీసీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను బొల్లారంలోని తన నివాసంలో అభిమానుల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం హనుమాన్ టెంపుల్ దగ్గర నుంచి అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని భారీ కేక్‌ని కట్ చేశారు. కాగా టపాసులు పేల్చి, గజమాలతో ఆయన్ను అభిమానులు సన్మానించారు. హనుమాన్ టెంపుల్ నుంచి బాల్ రెడ్డి నూ తన గృహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి అభిమానులు, ప్రజా ప్రతినిధులు శాలువాలతో సన్మానించి, మొక్కలను బహుకరిస్తూ, పుష్ప గుచ్ఛాలు ఆయనకు బహుకరించారు. అనంతరం కొలన్ బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్క కుటుంబ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు, స్థానిక ప్రజలకు హృదయపూర్వక ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవీందర్ రెడ్డి, కొలన్ నరేందర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు,వి. వేణుపాల్ రెడ్డి, బీరప్ప యాదవ్, బాలమణి రత్నం, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు రత్నం, యాదయ్య గౌడ్, ఆర్ఎల్ నాయుడు బీఆర్ఎస్ నాయకులు,శేషారెడ్డి, బషీర్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

27న సంగారెడ్డిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ



నవతెలంగాణ-సంగారెడ్డి

బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'ప్రజా యుద్ధ నౌక' గద్దర్ సంస్మరణ సభ ఈనెల 27న మధ్యాహ్నం 2:00 గంటలకు సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్ పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉంటుందని ప్రజాసంఘాల నాయకులు తెలి పారు. ఈ సభ విజయవంతం కోసం ఆదివారం బహుజన ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన ప్రజా సంఘాల నాయకులు పంబల్ల దుర్గా ప్రసాద్, విజయ్ రావు , గాంగేరి శ్రీనివాస్, శేఖర్, మల్లేశం, రమణి.అశోక్, నీరుడి. దుర్గేష్ , ఎల్.వేణుగోపాల్ మా ట్లాడుతూ.. ప్రజల పక్షాన నిరంతరం తన పాట మాటతో ఎంతోమందిని చైతన్య వంతుల్ని చేసిన ప్రజా నాయకుడు గద్దర్ అని కొనియాడారు. ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా, జేబీ రాజు, ఏపూరి సోమన్న, సూర్యం (గద్దర్ కుమారుడు), యాష్పాల్, కళాకారులు పలువురు ప్రము ఖులు హాజరు అవుతారన్నారు. కాబట్టి గద్దర్ అభిమానులు, యువకులు, మేధావులు, విద్యావంతులు, పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యాదవ సంఘం సంక్షేమానికి కృషి చేస్తా



నవతెలంగాణ-పటాన్‌చెరు

యాదవ సంఘం సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని యాదవ సంఘం నూతన ఉపాధ్యక్షులు పెద్ద గొల్ల మల్లేష్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని యాదవ సంఘం భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్ర మంలో యాదవ సంఘం కార్యవర్గాన్ని అ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతవారం యాదవ సంఘం అధ్యక్షుడిగా దేవయ్య యాదవ్‌ను ఎన్నుకున్న సంగతి విధితమే. ఈ సందర్భంగా యాదవ సంఘం ఉపాధ్యక్షులు పెద్దగొల్ల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. గతవారం యాద వ సంఘం అధ్యక్షుడిని, ఇప్పుడు ఉపాధ్యక్షుడు, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. సభ్యులందరితో కలిసి యాదవ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. యాదవ సంఘం సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు అండగా ఉంటా మని హామీ ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ ల సలహాలు, సూచనలతో యాదవ సంఘం అభివృద్ధి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు దేవయ్య యాద వ్, కార్యవర్గం సభ్యులు కృష్ణ, నర్సింహ, మల్లేష్, బిక్షపతి యాదవ్, మల్లేష్ యాదవ్, నర్సింలు యాదవ్, భీమన్న యాదవ్, శ్రీశైలం యాదవ్, వెంకటేష్ యాదవ్, జంగులు యాదవ్, నాగరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రామ్ మందిర్ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-కంది

మండలంలోని కాశీపూర్ గ్రామంలో ఆదివారం చేపట్టిన రామ్ మందిర్ నిర్మాణ భూమి పూజ శంకుస్థాపన మహోత్సవంలో స్టేట్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మెన్ చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు చింతా ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మెన్ కసాల బుచ్చిరెడ్డి, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రామ్ రెడ్డి, గ్రామ సర్పంచ్, ప్రజలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ 3 నవతెలంగాణ
సోమవారం 21 ఆగస్టు 2023

బొంబు గొండేశ్వర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బొంబుగొండేశ్వర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హాజరై.. ప్రజాప్రతినిధులు, గొల్ల కురుమ సంఘం నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మొగుడంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు నారాయణ యాదవ్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారయణ యాదవ్, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, ఇప్పెపల్లి పీఏసీఎస్ చైర్మెన్ దాసరి మచ్చేందర్, మొగుడంపల్లి ఎంపీటీసీ మొహమ్మద్ కుతుబుద్దిన్, సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడు బంగారి సురేష్, ఎంపీటీసీ తుక్కారాం తదితరులు పాల్గొన్నారు.



నేటి ప్రజావాణి రద్దు..



నవతెలంగాణ-మెదక్

మెదక్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో నేడు (సోమవారం) రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని దూరప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారని, అనివార్య కారణాలతో ఈ వారం ప్రజావాణి రద్దు అయిందని, ప్రజలు వచ్చి ఇబ్బందులు పడవద్దని సూచించారు.



వైద్యం వికటించి యువకుడి మృతి!

మెదక్ ఆదిత్య ఆసుపత్రి ఎదుట బాధితుల ఆందోళన

రూ.2 లక్షల సెటిల్మెంట్‌తో సద్దుమణిగిన వివాదం?



నవతెలంగాణ-మెదక్

ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన మహేష్ (26)కు జ్వరం వచ్చి అస్వస్థతకు గురవడంతో శనివారం సాయంత్రం మెదక్ పట్టణంలోని ఆదిత్య ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 1 గంటల సమయంలో మృతి చెందాడు. అయితే మహేష్‌ను ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్న వైద్యులు.. పరీక్షల పేరిట కాలయాపన చేశారని, సరైన వైద్య చికిత్సలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు ఆరోపించారు. రాత్రి సమయంలో పరిస్థితి విషమించిందని కుటుంబీకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం పై అనుమానాలు ఉన్నాయని వెల్లడించారు. మహేష్ మృతి చెందిన వెంటనే పోలీసుల భద్రతను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. సుమారు రెండు గంటల పాటు ఆసుపత్రి ఎదుట బాధిత కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. ఇదే క్రమంలో పలువురు నాయకులు జోక్యం చేసుకొని.. మృతుని కుటుంబానికి రూ. 2 లక్షలు సెటిల్మెంట్ చేసినట్టు సమాచారం. దీంతో ఆసుపత్రి వద్ద వివాదాన్ని విరమించారు. అయితే ఆసుపత్రి వర్గాలు మాత్రం మహేష్ గుండెపోటుతో చనిపోయాడని చెబుతున్నారు. బాధిత కుటుంబాల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య యాదమ్మ, నాలుగు నెలల చిన్నారి ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-చేగుంట

మండలలోని కర్ణంపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన బాలకృష్ణ వారి కుటుంబ సభ్యులను ఆదివారం ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి మోహన్ రెడ్డి పరామర్శించి.. ఆర్థిక సహాయాన్ని నేరుగా అందజేశారు. వారి కుటుంబానికి భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, తుమ్మి శ్రీనివాస్, కమ్మరి శ్రీనివాస్, యువత అధ్యక్షులు అందే చింటూ, పిఎసిఎస్ డైరెక్టర్ నల్ల ఆంజనేయులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో మహిళా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని వెంకటపూర్ గ్రామంలో జై గణేష్ గ్రామ మహిళా సమాఖ్య 2022-23 వార్షిక సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ సంఘం ఆడిట్ రిపోర్ట్, జమ చెల్లింపులు చదివి వినిపించారు. అనంతరం మహిళలను గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొత్తం 35 మహిళాసంఘాలు ఉన్నాయని, అందులో 332 మంది సభ్యులు ఉన్నారన్నారు. బ్యాంక్ రుణాలు 24 సంఘాలకు రూ.96 లక్షలు అందిందన్నారు. 10 కొత్త వ్యాపారాలను 10 ఏర్పాటు చేశారన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 310 మంది రైతుల నుంచి 16766 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారన్నారు. జై గణేష్ మహిళా సమైక్య ఇప్పటివరకు రూ.21 లక్షల 52 వేల లాభంలో ఉన్నదన్నారు. 2023-24కు ప్రణాళికకు కూడా ఆమోదం తెలిపారు. అందులో బ్యాంకు లింకేజీ 33 సంఘాలకు కోటి 58లక్షలు అందించడం.. 19 కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేయడం ఉన్నాయి. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ శేఖర్, వార్డ్ మెంబెర్స్ ఏళ్లం, నవీన్, రాజు, నరేష్, రాజు, నర్సింలు,గ్రామస్థులు దయాకర్, సిద్దిరాములు, పెంటయ్యా రాజేందర్, ఎల్లా గౌడ్, నందు, రమేష్, చందర్, సీసీ లక్ష్మి, వీవోఏ కవిత సంఘాల మహిళలు పాల్గొన్నారు.



చురుగ్గా సాగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

నవతెలంగాణ-నర్సాపూర్

మండల పరిధిలోని నత్నయిపల్లి గ్రామనికి ఎస్డిఎఫ్ నిధుల కింద రూ.20 లక్షలు మంజూరు కాగా.. ఈ నిధులతో గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో సీసీరోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ పనులను నత్నయిపల్లి గ్రామ సర్పంచ్ సాయమ్మ సత్యనారాయణ ఆదివారం సందర్శించి పరిశీ లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో ఇంతవరకు సీసీరోడ్లు లేకపోవడంతో నడవాలంటే ఇబ్బందిగా ఉండేదన్నారు. ఈ సీసీ రోడ్లతో గ్రామంలోని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్కు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శప్రాయుడు రాజీవ్ గాంధీ











నవతెలంగాణ-మెదక్

దేశం అత్యంత ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు అతిచిన్న వయస్సులోనే రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి పదవిని అధిరోహించి యువతకు ఆదర్శంగా నిలిచారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మామిళ్ళ ఆంజనేయులు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ఆర్థిక స్థితిగతులను అంచనా వేసి కేంద్ర నిధులు నేరుగా పల్లెలకు వచ్చే విధంగా రాజీవ్ గాంధీ చట్టాన్ని తెచ్చినట్లు తెలిపారు. రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల విధానాల వల్ల భారతదేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అత్యంత ప్రధాన పాత్ర పోషించి అనేకమంది యువతకు ఉపాధి కల్పిస్తున్నట్లు కొనియాడారు. దేశం కోసం తన ప్రాణ త్యాగాన్ని చేసిన రాజీవ్ గాంధీ జయంతి దేశ ప్రజల హృదయాలలో చిరకాలం నిలిచిపోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, మహమ్మద్ షఫీయుద్దీన్, రామారావు, పరమేష్, దేవదాస్, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

నిజాంపేట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం రాంపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ నర్సింలుతోపాటు సుమారు 20 మంది బీఆర్ఎస్‌కు చెందిన కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు కంఠ రెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివన్నారు. రాజీవ్ గాంధీ,ఇందిరా గాంధీ కుటుంబం దేశానికి ఎంతోసేవ చేసిందని.. వారి ఆశయాలను కొనసాగిస్తున్నామన్నారు. అదేవిధంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ఆకర్షితులైన రాంపూర్ గ్రామ ఉపసర్పంచ్ నర్సింలు వారి మిత్రులు కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభసూచికమన్నారు. రానున్న ఎన్నికలలో మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగర వెయ్యడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగం గౌడ్, పంజా మహేందర్, ముత్యాల మధుసూదన్ రెడ్డి, నసీరుద్దీన్, జిట్టి మారుతి, తమన్నాగారి మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మోహన్ రెడ్డి, చింతల నాగరాజు, సులేమాన్, విట్టల్, కాకి రాజయ్య, రామా గౌడ్, స్వామి, నరేష్, శ్రీకాంత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి : మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేక్‌ను కోసి వేడుకలు జరిపి.. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీసీ జిల్లా నాయకుడు ఈరప్ప యాదగిరి యాదవ్‌లు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని, ఆయన తల్లి మెదక్ ఎంపీ, మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ కూడా దేశం కోసం ప్రాణాలను అర్పించారన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కూడా పదవులను తృణ ప్రాయంగా వదిలిపెట్టిన మహా నేతలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరప్ప యాదగిరి యాదవ్ ఆధ్వ ర్యంలో నార్సింగి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్.ఐ అహ్మద్ మోహిఉద్దీన్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వినోద్, మండల కోఆర్డినేటర్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, ఫిషర్మన్ అధ్యక్షుడు సుధాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, శివనూర్ గ్రామ అధ్యక్షుడు చాంద్ పాషా, యూత్ నాయకుడు షేక్ గౌస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలు, భద్య, బీసీ సెల్ అధ్యక్షు డు స్వామి, సీనియర్ నాయకులు మల్కయ్య, సాయిరెడ్డి, రాములు, గోపాల్, గణేష్, జగన్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట : మాజీ ప్రధాని దివంతగ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వడ్ల నవీన్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ 1984లో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఎన్నో అద్భుతమైన సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. ఐటీ రంగంలో, టెలికాం రంగంలో కంప్యూ టర్ విభాగంలో టెక్నాలజీ పరంగా దేశం ప్రపంచంలోనే ముందడుగులో ఉండాలని, సైన్స్ పరంగా దేశాన్ని ముం దుకు నడిపించారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాసాపేట శ్రీనివాస్, నాయకులు మోసంబిల్, ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, ఫిషర్మెన్ అధ్యక్షులు సోమ వెంకటేష్, ఆగమయ్య, రాజు, వల్సా అనిల్‌కుమార్, భీమ్రావుపల్లి కుమార్, ఉల్లి తిమ్మాయిపల్లి అధ్యక్షులు ఎర్ర రాజకుమార్, ఉపాధ్యక్షులు సురేష్, యాదగిరి, అతుకూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌రూరల్, మనోహరాబాద్ : మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహి ంచారు. మండలంలోని కాళ్లకల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, మోయిన్, యువజన కాంగ్రెస్ నాయకులు సర్వీన్ గౌడ్, రామస్వామి, మధు, లక్ష్మణ్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి కాళేశ్వరం నీళ్లు తెస్తాం

- ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి
- చేగుంట, నార్సింగ్ మండలాల విస్తృతస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరు
- ఈనెల 23న సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు
- ఈ సభలోనే ఎమ్మెల్యేల జాబితా ప్రకటింపు!

నవతెలంగాణ-చేగుంట

ప్రతీ గ్రామానికి కాళేశ్వరం నీళ్లు తీసుకువచ్చి.. రైతులందరినీ ఆదుకుంటామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట పట్టణ కేంద్రంలోని మక్కరాజుపేట రోడ్డులో గల బాలాజీ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం చేగుంట, నార్సింగ్ మండలాల విస్తృతస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఎంపీ హాజరై మాట్లాడారు. ఈనెల 23న మెదక్‌లో నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు.. బీఆర్ఎస్ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారన్నారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను కూడా ప్రక టిస్తున్నారని.. దుబ్బాక నియోజకవర్గం అభ్యర్థిగా కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరు కూడా ఉంటుందన్నారు. కాబట్టి మెదక్, నరాస్పూర్, నారాయణఖేడ్, చేగుంట, నార్సింగ్ ఏరియా పరిధిలో నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలన్నారు. తను రెండు పర్యాయలుగా ఎంపీ స్థానంలో ఉండి ప్రజలకు సేవ చేశానని.. ఈసారి ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేసి భారీ మెజార్టీతో తనను ఎమ్మెల్యే గెలిపించాలన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడుందని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్నారు. మెదక్ నియోజ కవర్గంలో ఇందిరా గాంధీ పోటీ చేసినప్పటి నుండి అభివృద్ధి ఏమాత్రం లేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చాకే అభివృద్ధి జరిగిందన్నారు. చేగుంట, నార్సింగ్ మండలాల్లో మల్లన్నసాగర్ పిల్ల కాలువలు పెండింగ్లో ఉన్నాయని త్వరలోనే అవి పూర్తి చేస్తామన్నారు. అలాగే వివిధ మండలాల్లో మహిళా సంఘ భవనాలు, రోడ్ల సమస్యలు, అంగన్వాడి భవనాలు, అక్కడక్కడ పెండింగ్లో ఉన్నాయని.. ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే తప్పకుండా పరిష్క రి స్తామన్నారు. ప్రతీ గ్రామంలో బూత్ కమిటీ, కార్మిక, మహిళా, రైతుల కమిటీలను వేసి ప్రజలందరిని బీఆర్ఎస్‌కు ఓట్లు వేసేలా చైతన్యం చేయాలన్నారు. అలాగే సీఎం మహా సభలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీని వాస్, జడ్పిటిసి శ్రీనివాస్, సర్పంచుల పూర్వ అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు తాడెం వెంగ శరావు, పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, నర్సింగ్ మండల ఎంపీటీసీ సుజాత మల్లేశం, భారతమ్మ సత్తయ్య, సర్పంచ్ ఎర్రం అశోక్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన బిజ్జ రత్నవ్వ మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మృతురాలి కుటుంబానికి రూ.5వేల రూపాయల ఆర్థిక సాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేతుల మీదుగా ఆదివారం అందజేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ ఆకుల బాలయ్య , ఆకుల నాగరాజు, జి అంజయ్య సిహెచ్ దేవదాసు, దాసరి ఏలియా లద్ద రాజయ్య, బిజ్జ కృపాకర్, బిజ్జ సురేష్, సిహెచ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

గిరిజనులను మోసం చేస్తున్న బీఆర్ఎస్ సర్కార్



నవతెలంగాణ-నర్సాపూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తున్నదని ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జిల్లా సరోజ్ నగర్ ఎమ్మెల్యే రాజేశ్వర్ సింగ్ ఆరోపించారు. ఆదివారం నర్సాపూర్‌లో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై.. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దమ్మతాండ మీదుగా వెళ్తున్న సందర్భంగా గిరిజన మహిళలను చూసి కారులో నుంచి దిగి కొద్దిసేపు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా?.. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం వస్తుందని.. ఏమైనా సమస్యలు ఉంటే అన్ని పరిష్కరిస్తామని గిరిజన మహిళలకు హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సింగయ్య పల్లి గోపి, వల్దాస్ మల్లేష్ గౌడ్, సంఘసాన్ని సురేష్ , రఘువీరా రెడ్డి, చిన్న రమేష్ గౌడ్, ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు ధనావత్ సురేష్ నాయక్, ఆంజనేయులు గౌడ్, గిరిజన మహిళలు తదితరులు ఉన్నారు.

పద్మా దేవేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వొద్దు

- మెదక్ రాందాస్ చౌరస్తాలో ఆందోళన

నవతెలంగాణ-మెదక్

మెదక్ నియోజకవర్గంలో తొమ్మిదేళ్లుగా సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదని.. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఆమెకు ఇవ్వొద్దని చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ విజయ లక్ష్మి ప్రభాకర్, మైనంపల్లి సోషల్ సర్వీస్ సభ్యులు బొజ్జ పవన్, సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో పలువురు అసమ్మతి బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు 'పద్మ వద్దు.. కేసీఆర్ ముద్దు' అంటూ నినాదాలు చేస్తూ ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గంలో తొమ్మిదేళ్ళ కాలంలో ప్రస్తుత ఎమ్మెల్యే పద్మ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. జిల్లాలో ఉన్న కార్యాలయాలను సిద్ధిపేటకు తరలించారన్నారు. మెదక్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ టికెట్ ఈసారి పద్మాదేవేందర్ రెడ్డికి ఇస్తే తాము అనుకూలంగా ఉండబోమని స్పష్టం చేశారు. ప్రజలకు సేవా కార్యమాలు చేసే ఏ వ్యక్తికి అయిన మెదక్ అసెంబ్లీ బీఆర్ఎస్ టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరుశురాం, విశాల్ రాజ్, భారత్ రామ్, బొజ్జ పవన్, మెడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

నవతెలంగాణ-మెదక్

'కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఊరుకునేది లేదు.. మంత్రి హరీశ్‌రావు పిచ్చికూతలు మానుకోవాలి' అని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం మెదక్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని పణంగా పెట్టి తెలంగాణ ఇచ్చిందని, త్యాగం తమదైతే భోగం బీఆర్ఎస్ అనుభవిస్తుందని మండిపడ్డారు. రెండు పర్యాయాలు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేయడంలో కల్వకుంట్ల కుటుంబం విఫలమైందన్నారు. ప్రజాదరణ కోల్పోయి అధికారం చేజారుతుందనే బాధలో మంత్రి హరీష్ రావుకు మతి భ్రమించి కాంగ్రెస్ పార్టీ పై విషం కక్కుతున్నారన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్, మాజీ కౌన్సిలర్ విక్రమ్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, ఎస్సీ సెల్ నాయకులు సంజీవ్, నాయకులు అశోక్ రెడ్డి, జాకీర్, ఆమీర్, జకారియా తదితరులు పాల్గొన్నారు.



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం





నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని శంకాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం పట్ల గ్రామ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి.. కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ గ్రామాభివృద్ధికి ఇలానే సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిధుల మంజూరీకి కృషి చేసిన పట్లూరు రాజన్న, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ సబిత రవీందర్, వైస్ ఎంపీపీ సుజాత శంకర్, పార్టీ మండలాధ్యక్షుడు మిలారం బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల మంజూరీ పట్ల గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే తమ గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని, దాని స్థానంలో నూతన భవనం నిర్మాణం చేయాల్సి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే.. వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. అందుకు గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. రాబోయే ఎన్నికలలో గ్రామం నుంచి పద్మాదేవేందర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇచ్చి రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు సిద్దా గౌడ్, వార్డు సభ్యులు లక్ష్మి మల్లేష్, పద్మ నర్సింలు, సొసైటీ డైరెక్టర్ రెడ్డిపల్లి శ్రీనివాస్, యూత్ ఉపాధ్యక్షుడు శ్యామ్, సీనియర్ నాయకుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా యువత స్వచ్ఛభారత్





నవతెలంగాణ-తూప్రాన్‌రూరల్, మనోహరాబాద్

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లోని యువత 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాలను చేపట్టారు. తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆరో వార్డులోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించారు. చెట్లకు పాదులు తీసి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఇప్పటివరకు నిరంత రాయంగా 373 వారాలుగా గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సర్పంచ్ మన్నేమహాదేవి నవీన్, ఉపసర్పంచ్ ఆంజనేయులు గౌడ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మామిళ్ళ స్వామి, అంగనావ్డి టీచర్ స్వర్ణలతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి మన్నే మమత బాపు రాజ్, ఆశా వర్కర్ ఇందిరా, ఐకెపి వివోఏ సంతోష, అంగన్వాడి టీచర్ లావణ్య మేకిన్ యువత తదితరులు పాల్గొన్నారు.

అలాగే మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 279 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలోని హరిత వనం పార్కులో వర్షాలకు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి చెట్లకు పాదులను తీశారు. నేచర్ ఐకాన్ యూత్ సభ్యులతోపాటు గ్రామంలోని చిన్నారులు సైతం స్వచ్ఛభారత్‌లో పాల్గొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. అనంతరం నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు చిన్నారులతో హరితవనం పార్కులో గల బుద్ధ విగ్రహం ముందు యోగా అభ్యసనం చేశారు. నేచర్ ఐకాన్ యూత్‌తో పాటు చిన్నారులు చేపడుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమం ఇతర గ్రామాలకూ ఆదర్శంగా నిలుస్తున్నది.

ముఖ్యమంత్రి సభకు భారీగా తరలి రావాలి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్, మనోహరాబాద్

ఈనెల 23న మెదక్‌లో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు మండలం నుంచి భారీగా జనాలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల ఇన్చార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని కోరాయిపల్లి పిటి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన ధ్యేయంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ సారథ్యంలో అందిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పథకాలను కూడా కాపీ కొట్టే స్థాయికి చేరుకున్నదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి సభకు మండలం నుండి 4,000 మందిని తరలించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రాకల శేఖర్ గౌడ్, భాష బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు పురం మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కరపత్రం విడుదల



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం చలో ఢిల్లీ కరపత్రం విడుదల చేశారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం సిద్ది పేట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పత్తిని శారద సింగిరెడ్డి నవీన మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల పెరుగుతున్న హింస అసమానతలకు వివక్షత, అన్యాయాలకు వ్యతిరేకంగా ఐద్వా మహిళా సంఘం అక్టోబర్ 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పిలుపును ఇచ్చారు. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తిగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



నవ తెలంగాణ- గజ్వేల్

అహ్మదీపూర్ గ్రామం శ్రీ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పిటిసి పంగ మల్లేశం, భారస మండల అధ్యక్షుడు బెండే మధు, మార్కుక్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్ గుంటుకు రాజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అందరినీ శాలువాతో సత్కరించి హనుమాన్ ఫొటో జ్ఞాపక అందజేశారు.

బడుగు బలహీనుల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం



నవతెలంగాణ రాయపోల్

పేదల సంక్షేమం, బడుగు బలహీనుల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షులు తప్పేట సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని గొల్లపల్లి, సయ్యద్ నగర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులుగా బండారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తూర్పు స్వామి, ప్రధాన కార్యదర్శిగా బండారి రవి, మత్స్యశాఖ గ్రామ అధ్యక్షులుగా భుచంగారి మహేష్, అలాగే సయ్యద్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఇస్మాయిల్ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు 500 రూపాయలకే గ్యాస్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఇప్ప మల్లేశం, దయాకర్, కృష్ణ గౌడ్, రమేష్, రవి, స్వామి గౌడ్, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లర్నింగ్ లైసెన్స్ అందజేత



నవ తెలంగాణ దౌల్తాబాద్

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ఇటీవల నియోజవర్గ కేంద్రమైన దుబ్బాకలో డ్రైవింగ్ లైసెన్స్ లేని యువతీ యువకుల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపు సందర్భంగా వందలాది మంది దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే ఆదివారం మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ డేవిడ్ లావణ్య నరసింహారెడ్డి చేతుల మీదుగా అర్హులందరికీ లెర్నింగ్ లైసెన్స్ పత్రాలను అందజేయడం జరిగింది. ఈ పత్రాలను ఉచితంగా అందజేయడం మూలంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి చెల్లించవలసిన ఫీజును పూర్తిగా ఎమ్మెల్యేని భరించడం జరిగిందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

నాణ్యతలేని సీసీరోడ్లు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండ లం చౌటపల్లి గ్రామంలో గత కొన్ని నెలల కింద పోసిన సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్తు డు నాగభూషణం ఆది వారం తెలియజేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి హనుమాన్ టెంపుల్ నుంచి మంద సంపత్ ఇంటి వరకు వేసిన ఈ సిసి రోడ్డు కనీసం సంవత్సరం గడవకముందే కంకరలేచి, గుంతలు పడిందన్నారు. కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకుని సీసీరోడ్డును బాగు చేయించాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-తొగుట

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం సంతృప్తి కలుగుతుందని సేవ సమితి సభ్యు లు పేర్కొన్నారు. ఆదివారం పెద్ద మాసన్ పల్లి గ్రామానికి చెందిన కాస యాదగిరి కొద్దిరోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్ద మసాన్ పల్లి సేవ సమితి సభ్యులు మిత్రుడి కుటుంబ పరిస్థితి దృశ్య వరి కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాల కు ఆర్థిక సహాయం అందించడంలో ఎంతో సంతృ ప్తి కలుగుతుందన్నారు. మానవసేవే మాధవసేవ నినాదంతో పెద్ద మాసన్ పల్లి గ్రామ సేవా కమిటీ ముందుకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకుడు

నవ తెలంగాణ దౌల్తాబాద్



సఫాయి కార్మికురాలు కుమారుడు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన దేశ భద్రత జవాన్ రాత పరీక్షలు నిర్వహించడంతో దౌల్తాబాద్ మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి రమేష్ పట్టుదలతో ఆర్మీ ఉద్యోగం సాధించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం వెళ్లడం గ్రామానికి ఎంతో గర్వకారణమని సర్పంచ్ సురేందర్ రెడ్డి, తోటి మిత్రులు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

దార్శనికుడు రాజీవ్‌గాంధీ













- పేదలు పదేళ్ల కింద ఎట్లున్నరో ఇప్పుడు అట్లే ఉన్రు
- బతుకులు మారాలంటే చేయి గుర్తుకు ఓటేద్దాం
- కత్తి కార్తీక గౌడ్

నవ తెలంగాణ- దుబ్బాక

దివంగత భారత ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి దర్శనీకుడని ఆయన వల్లే దేశంలో ఓపెన్ యూనివర్సిటీలు, కంప్యూటర్స్, మొబైల్స్, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు అభివృద్ధి చెందాయని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యురాలు, అధికార ప్రతినిధి కత్తి కార్తీక గౌడ్ అన్నారు. ఆదివారం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ 79 వ జయంతి సందర్భంగా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పద్మశాలి భవన్ లో కత్తి కార్తీక గౌడ్ ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేశారు. ఆనంతరం కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సుమారు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల బతుకులు నేటికీ మారలేవని,పదేళ్ల కిందట ఎట్లున్నారో ఇప్పుడు అట్లనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కెసిఆర్ సర్కారు సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటుందని విమర్శించారు. చీమలు పాముని చంపినట్లు అందరమొకటై కేసిఆర్ సర్కారును గద్దె దింపాలన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఇంటి ఆడబిడ్డవోలే అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. ఒక్కసారి ఆలోచించండని బతుకులు మారాలంటే చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త దేవి రెడ్డి, కర్నాల శ్రీనివాసరావు, ఐరేని సాయితేజ గౌడ్ పాల్గొన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట: కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి సూచించారు. సిద్దిపేటలోని పొన్నాల వద్ద ఆదివారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల ఆశయాలను కొనసాగించేలా కొత్త సంస్కరణలకు పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో , రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా పార్టీ పునర్ వైభవానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. పదేళ్ల బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వంల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని, ఈ ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని, బంగారు తెలంగాణగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికలకు ప్రతి ఒక్కరు సమయత్వం కావాలని, ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్ల పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు బొమ్మల యాదగిరి, గంప మహేందర్, సూర్య వర్మ విరుపాక శ్రీనివాస్ రెడ్డి, నాయిని నరసింహారెడ్డి, తప్పేట శంకర్, రాములు, పుల్లూరు కనకయ్య, గ్యాదరి మధు, గయాసుద్దీన్, లింగారావు, స్వామి, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ - దౌల్తాబాద్ : దిగంగత దేశ ప్రధాని రాజీవ్ గాంధీ 79 వ జయంతి వేడుకలు పురస్కరించుకొని మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి తనయుడు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నేతలు వేరువేరుగా మాట్లాడుతూ రాజీవ్ గాంధీ 1944 పుట్టి 1991లో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులు ఈ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వరాష్ట్రం ఏర్పడడానికి సోనియా గాంధీ చేసిన త్యాగాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ బండారు లాలు దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, భద్రయ్య గొడుగుపల్లి మాజీ ఎంపిటిసి మద్దెల స్వామి , షేర్ పల్లి స్వామి రమేష్ యాదగిరి తలారి దుర్గయ్య పాల్గొన్నారు.

నవ తెలంగాణ రాయపోల్: భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి నడిపిన ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడ సుధాకర్ అన్నారు. ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ 79 జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం రాయపోల్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణం లో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పేట సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ దేశం డిజిటల్ రంగంలో దూసుకుపోతుందంటే ఆనాడు రాజీవ్ గాంధీ కమ్యూనికేషన్ రంగాన్ని పరిచయం చేసి అభివృద్ధి చేయడమే కారణమన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం వాణిజ్య, వ్యాపార రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ మండల నాయకులు రాజిరెడ్డి, ముత్యం రెడ్డి, దయాకర్, కృష్ణ గౌడ్, ఇప్ప మల్లేశం, రమేష్, రవి, స్వామి గౌడ్, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్ : భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి , సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య జిల్లా కన్వీనర్ చిత్తారి రవీందర్, మాజీ ఎంపిటిసి ఎండి హసన్, పార్టీ మండల అధ్యక్షులు బంక చందు హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ ,కౌన్సిలర్స్ పున్న లావణ్య సది, జిల్లా మాజీ కన్వీనర్ వెన్నరాజు, బీసీ సెల్ అధ్యక్షులు బాలయ్య, ఎస్సీ సెల్ గాజుల చంద్రయ్య ,బూరుగు కృష్ణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహెడ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలకే ప్రధాని పీఠాన్ని అధిరోహించారని, 508 లోకసభ సీట్లకు గాను 401 సీట్లు గెలుచుకున్నారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో సంస్కరణలు తెచ్చారని, ఐటి కమ్యూనికేషన్ రంగాల ఆవశ్యకతను ముందుగానే ఊహించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, రాచురి శ్రీనివాస్, కొమ్ముల చిన్న కనకారెడ్డి, పోలు శ్రీనివాస్, అన్నాడి రాజేందర్‌రెడ్డి, నంగునూరి శ్రీనివాస్, భైరి సుధాకర్, బుర్ర వెంకటస్వామి, మంద రఘుపతి, దుర్గా ప్రసాద్, శ్రీపాల్, మణిదీప్, శ్రీనాథ్, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తుకు ఇచ్చిన సమయం

సంక్షేమ పథకాలకు ఎందుకు ఇవ్వరు?

కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ

నవ తెలంగాణ - సిద్దిపేట



రాష్ట్ర ప్రభుత్వం మరో మూడు నెలల్లో ముగియనున్న మద్యం దుకాణాల కోసం ముందస్తుగా టెండర్లను పిలిచిందని, దరఖాస్తుల కోసం పదిహేను రోజులు అవకాశం ఇచ్చిందని కానీ బీసీలకు ఇచ్చే లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గృహలక్ష్మి పథకాలకు కేవలం మూడు రోజులే గడువివ్వడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్య వర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టిపిసిసి మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అర్షద్, సెక్రటరీగా సిరాజ్, డిసిసి సేవాదళ్ జనరల్ సెక్రటరీగా మోతే కుమారస్వామి లు నియామకం కాగా, ఆదివారం వారికి సూర్య వర్మ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు కేవలం హుజురాబాద్ ఎన్నికల సమయంలోనే సీఎం కేసీఆర్ ఇచ్చారని, తర్వాత మరిచారని, బీసీలకు ఆర్థిక సహాయం, గృహలక్ష్మి పథకాలు కేవలం బిఆర్ఎస్ నాయకులకు మాత్రమే నని, అర్హులకు మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. మైనార్టీల కోసం ఇచ్చే లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎంతమంది దరఖాస్తు చేసుకుంటే అంతమందికి ఇవ్వాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలలో నాణ్యత లోపించిందని, రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి హరీశ్ రావు లు స్పందించి డబుల్ బెడ్ రూమ్ లను మెరుగుపరచాలని, లేకుంటే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ధర్నాలు, నిరసనలు తెలియజేయడానికి స్వేచ్ఛ ఉందని, కానీ బిఆర్ఎస్ పాలనలో ఎవరికి స్వేచ్ఛ లేదని అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అకాల వర్షం తో నష్టపోయిన రైతులకు పదివేల ఆర్థిక సాయం చేస్తామన్న సీఎం కేసీఆర్ ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు. ఉచిత ఎరువులు ఎంతమందికి ఇచ్చారని, రైతు రుణమాఫీ ఎంత మందికి చేశారని ప్రశ్నించారు. రైతులకు ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పథకమని అన్నారు. ఎక్కడ 24 గంటల ఉచిత విద్యుత్తును ఇచ్చారో మంత్రి హరీశ్ రావు నిరూపించాలని కోరారు. సబ్ స్టేషన్లలో ఉండే లాగ్ బుక్కులను దాచి పెట్టారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ కు పెరుగుతున్న ఆదరణను చూసి భయం పుట్టుకొచ్చిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు. తాను సిద్దిపేట అసెంబ్లీ నుండి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, త్వరలోనే గాంధీభవన్ లో టికెట్టు కోసం దరఖాస్తు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా లేదని, బిఆర్ఎస్ నాయకులు బలహీన పరుస్తున్నారని అన్నారు. సిద్దిపేటలో కూడా కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి, వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్ గౌడ్, సీతా బాలు, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, జిత్తు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోచంపల్లి సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-చేర్యాల, కొమురవెల్లి





సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. కొమురవెల్లిలో గల శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న అనంతరం చేర్యాల పట్టణంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కల్యాణి గార్డెన్‌లో పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచంపల్లి తాను రాజకీయాలు చేయడానికి రాలేదని, మల్లికార్జున స్వామి దయతో సీఎం కేసిఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ మూడవసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నకాశి చిత్రపటాన్ని కౌన్సిలర్ ఆడెపు నరేందర్ పోచంపల్లికి అందజేశారు. అనంతరం పట్టణంలోని కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ నివాసాలకు వెళ్లి వారిని పలకరించారు. ఒకవైపు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ,ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య టికెట్ రాజకీయం ముదురుతున్న నేపథ్యంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఎమ్మెల్సీ పోచంపల్లి సుడిగాలి పర్యటన మరింత చర్చనీయాంశంగా మారింది.దీంతో ముగ్గురిలో అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో తెలియక కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.సమావేశంలో చేర్యాల వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి,ఆడెపు నరేందర్,ఎంపీటీసీ ల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు బాలరాజు,ఎండీ.ఏక్బాల్,పచ్చిమడ్ల మానస తోపాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి

నవ తెలంగాణ- గజ్వేల్ : మెతుకు సీమ బిడ్డ ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలని గద్దర్ సంస్మరణ సభలో తీర్మానించారు. ఆదివారం గజ్వేల్ టీపీటీఎఫ్ ఉపాధ్యాయ భవన్‌లో దళిత ప్రజా సంఘాల అధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభ డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి అధ్యక్షతన జరిగింది. ట్యాంక్ బండ్ పై గద్దర్ విగ్రహం పెట్టాలని, హైదరాబాదులో గద్దర్ స్మృతి వనం నిర్మించాలని సభ డిమాండ్ చేసింది. గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలన్నారు. సభకు హజరైన సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీ రాములు మాట్లాడుతూ పెదల హక్కులు, ఆత్మగౌరవం కోసం గద్దర్ జీవితాంతం పోరాడారన్నారు. గద్దర్ అంబేద్కర్ యుగపురుషుడన్నారు. పేదలు అంటె గద్దర్‌కు ప్రాణమన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం కోసం పోరాడటమే గద్దరన్నకు నిజమైన నివాళి అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఏడు తరాల గ్రంథమని, కొట్లాది మంది తలరాతలు మార్చిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని గద్దరన్న పిలుపునిచ్చాడన్నారు. బాగ్యరెడ్డి వర్మలాగా గద్దర్ మహబోధి విద్యాలయాన్ని ప్రారంభించి పేదల దరికి ఉన్నత విద్యను చేర్చాడన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్ మాట్లాడుతూ గద్దర్ ఒక లెజెండ్ అని అయన పేరుతో అవార్డు ను ఇస్తామని ప్రకటించారు. గజ్వేల్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాలలో గద్దర్ విగ్రహాలు పెట్టాలన్నారు. టిపిటిఫ్ జోన్ కన్వీనర్ నరేందర్ మాట్లాడుతూ గద్దరన్న మాటలతొనె పాటలు పాడగల సమర్థుడు గద్దరన్న అన్న గురుంచి మాట్లాడట మం టనే అది ఒడవని ఘని అని అనేక విషయాలను గుర్తుచేశారు.

జెడ్పిటిసి వంగమల్లే శం మాట్లాడుతూ గద్దరన్న ఈ ప్రాంతంలో పుట్టి ఎల్లలు దాటి పాటలు పాడిన మహనుబావుడన్నారు. ఎమ్ పి పి అమరావతి మాట్లాడుతూ గద్దరన్న సేవలు మరువరానివన్నారు .యంఇఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెబర్తి యాదగిరి మాట్లాడుతూ గద్దర్ జీవితం గొప్ప స్ఫూర్తి దాయకమన్నారు.మాల మహనాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనువాస్,ఎమ్ ఎస్ పి రాష్ట్ర నాయకులు మైస రాములు,యు.టి.ఎఫ్ రాష్ట్ర నాయకులు తుమ్మ కనుకయ్య,కొడకండ్ల కిరణ్,సామాజిక కార్యకర్త ఉమర్ సుల్తానా,అఖిల భారత యాదవ మహసంఘం నాయకులు వెంకటేశం,దళిత ఉపాధ్యాయ సంఘం నాయకులు దమ్మని మల్లేశం,టిపిటఫ్ నాయకులు రాజులు కొడకండ నర్సింలు,దర్మారెడ్డి పల్లి శ్రీను,అనంతరావు పల్లి ప్రభాకర్,పుట్ట రాజు,మట్టిమనిషి పర్శరాములు, భూమయ్య, బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, దూల్మిట్ట మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని చేర్యాల సిఐ సత్యనారాయణ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు.సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన గుర్తుపట్టేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్,ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు,మద్దూరు ఏఎస్ఐ జిల్లా జగదీష్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించడం ఖాయం

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



నవతెలంగాణ-తొగుట: దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి సీఎం కేసీఆర్ అవకాశం ఇవ్వడం పట్ల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రెండుమార్లు మెదక్ పార్లమెంటు సభ్యులుగా ప్రజల కోసమే పనిచేస్తూ, సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్ రావు సహకారంతో దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తూ, అభివృద్ధి, సంక్షే మంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యేగా ప్రభాకర్ రెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందున ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటలకు హబ్సీపూర్ నుండి దుబ్బాక వరకు ర్యాలీ నిర్వ హించేందుకు బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలి రావాలని కోరారు. ప్రభాకర్‌రెడ్డికి ఘన స్వాగతం పలకడానికి తొగుట మండలం నుండి ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ ప్రతినిధులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు.

ఓపెన్ జిమ్ నిర్వహణలో నిర్లక్ష్యం

ఆఫీసర్ల పట్టింపు కరువు

నవ తెలంగాణ-దుబ్బాక





దుబ్బాక పురపాలిక కేంద్రంలోని రామసముద్రం చెరువు కట్టపై చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో బిగించిన ఓపెన్ జిమ్ పరికరాలు తుప్పుపట్టి విరిగిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వాటి కింద వేసిన రబ్బర్ షీట్స్ ఊడిపోతున్నాయి. ఓపెన్ జిమ్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరికరాలు, రబ్బర్ షీట్స్ ఊడిపోతున్నా వాటిని సరి చేయాల్సిన అధికారుల పట్టింపు కరువైంది. వ్యాయామం చేసేందుకు వచ్చే పట్టణవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మునిసిపల్ అధికారులు చొరవ తీసుకొని వెంటనే వాటికి మరమ్మత్తులు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న ఎల్లారెడ్డిపేట ప్రాథమిక సహకార భవనం



నవతెలంగాణ-తొగుట

మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన ప్రాథమిక సహకార సంఘానికి భవనం శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రైతులకు కావాల్సిన ఎరువులు, గ్రామానికి సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతున్నాయి. అందులో ఎలుకలు, పంది కొక్కులు సైతం భారీగా గోతులు తవ్వాయని చెబుతున్నారు. ఏదైనా సందర్భంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొడుగుపల్లిలో నీరంతా వృథా

పట్టించుకోని అధికారులు



నవ తెలంగాణ -దౌల్తాబాద్

భూగర్భ జలాలను కాపాడుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లబోదిమంటూ మొత్తుకున్నా అధికారులు నిమ్మకు నీరేసినట్లు వివరించడం బాధాకరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని గోడుగుపల్లిలో గ్రామ సచివాలయ సమీపంలో 24 గంటలు బోరు మోటార్ నడుస్తూనే ఉంటుందని, దీంతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పాటు కరెంటు బిల్లు విపరీతంగా రావడం వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. దీని మూలంగా ప్రజాధనం వృథా అవుతోందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవ తెలంగాణ- గజ్వేల్

బీజేపీ నాయకులు గురువారెడ్డి, నాలాగామ శ్రీనివాస్ బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్లు సురేష్, మహేష్, బిజెపి గజ్వేల్ పట్టణ, మండల అధ్యక్షులు ఉప్పల మధుసూదన్, పంజాల అశోక్ గౌడ్ జగదేపూర్ మండల అధ్యక్షుడు కోదండమ్ శ్రీనివాస్ రెడ్డి, బిజెపి ఎస్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు మైస విజయ్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి, బిజెపి బిజెవైఎం నాయకులు ఆనంద సాయి గౌడ్, అశోక్ యాదవ్, నరేందర్, గడ్డమీది ప్రశాంత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.